క్లుప్తంగా

మూడు వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

నందిగామ: పట్టణంలోని పలు ప్రాంతాలకు రెండురోజులపాటు పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుందని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట రోడ్డులో ఉన్న మేజర్ పైప్‌లైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో నందిగామ పట్టణంలోని 2,16,19వ వార్డుల పరిధిలో శనివారం నుంచి రెండు రోజులపాటు పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోతుందన్నారు.ఈ ప్రాంత వాసులకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని వివరించారు. తాగునీటి ఇబ్బందులు ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్ 9493814856ను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉందని ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 144 సెక్షన్ తోపాటు పోలీస్ యాక్ట్–30కూడా అమలులో ఉందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు, అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకేచోట గుమ్మి కూడి ఉండ కూడదన్నారు.అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. డీజేలు ఏర్పాటు చేయడం, బాణాసంచా కాల్చడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలు పాటించని వారిని ఉపేక్షించేది లేదని ఏసీపీ హెచ్చరించారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

మంగొల్లు(వత్సవాయి) : పురుగుల మందు తాగి ఓ వివాహిత మృతిచెందడంపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ బి.అభిమన్యు శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు మంగొల్లు గ్రామానికి చెందిన కొత్తపల్లి స్పందన(20)ను నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామానికి చెందిన గోపికి ఇచ్చి వివాహం చేశారు. స్పందన గర్భిణిగా ఉండటంతో ఆరునెలల కిందట భర్త గోపి ఆమెను డెలివరీ నిమిత్తం పుట్టింటికి పంపించారు. ఆరు నెలల కిందట ఆమె బాబుకు జన్మనివ్వగా, అనారోగ్య కారణాలతో 12రోజుల కిందట ఆ బాబు మృతిచెందాడు. ఈనేపథ్యంలో తన భార్యను తనవెంట తీసుకువెళ్లాలంటూ అదనంగా కట్నం కావాలంటూ గోపి వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైనర స్పందన శుక్రవారం పురుగుల మందు తాగి మృతిచెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తునట్లు ఎస్‌ఐ అభిమన్యు తెలిపారు.

బీఓఐ 666 రోజుల స్థిర డిపాజిట్ పథకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల సౌకర్యార్థం బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగా 666 రోజుల స్థిర డిపాజిట్ పథకం ప్రారంభించినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ మేనేజర్ ఎంపీ బంగార్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా డిపాజిట్ చేసిన సూపర్ సీనియర్ సిటిజన్లకు ఏడాదికి 7.95 శాతం, సీనియర్ సిటిజన్లకు7.80శాతం, సాధారణ వ్యక్తులకు 7.30శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు వివరించారు. '666 డేస్ – ఫిక్స్‌డ్ డిపాజిట్' లో రూ. 2 కోట్ల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం ఈనెల ఒకటోతేదీ నుంచి అమలులోకి వస్తుందని, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై లోన్, అకాల విత్‌డ్రా సౌకర్యం అందుబాటులో ఉందని వివరించారు. ఈ డిపాజిట్ కోసం వినియోగదారులు ఏదైనా బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో స్వయంగా గానీ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓమ్ని నియో యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు.

నైపుణ్యాల పెంపునకే వేసవి శిక్షణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసి వాటికి మెరుగులు దిద్దేందుకే ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన ఉచిత వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతుల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో నెల రోజుల పాటు ఉచితంగా చిత్రలేఖనం, దస్తూరి, క్లే మౌల్డింగ్ క్రాఫ్ట్ వర్క్, యోగ వెస్ట్రన్ డాన్స్, ఫోక్ డ్యాన్స్, భరతనాట్యం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఏటా మరిన్ని కోర్సులతో 500 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. జూన్ 9న అన్నసంతర్పణ సమితి మూడవ వార్షికోత్సవం సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం హెడ్ మాస్టర్ పుల్లంరాజు, సునీత పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో ఆరుశాతం ఓట్లు పెరుగుదల

- 2019 ఎన్నికలతో పోల్చితే ఈసారి భారీగా పెరిగిన పోలైన ఓట్లు
- జగ్గయ్యపేటలో ఆరుశాతం పెరుగుదల
- నందిగామలో 4.6శాతం అధికం
- తమకే లాభించనుందంటున్న వైఎస్సార్ సీపీ
- సంక్షేమానికి జనం జైకొట్టారని ధీమా



పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడులో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

జగ్గయ్యపేట/నందిగామ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో భారీగా పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో గత 2019 ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే ఆరుశాతం అధికంగా, నందిగామ నియోజకవర్గంలో 4.6శాతం అధికంగా ఈసారి ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో జగ్గయ్యపేటలో పది మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలువగా, ఈసారి 13మంది పోటీలో ఉన్నారు. నందిగామలో గత ఎన్నికల్లోనూ, ఈసారి కూడా తొమ్మిది మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

10,769 ఓట్లు అధికంగా పోల్..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఈసారి జిల్లాలోనే అత్యధికంగా 89.88శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,05,364 మంది ఓటర్లకుగాను 1,84,575 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. హోం, పోస్టల్ ఓటింగ్ ద్వారా 2309మంది ఓటు వేశారు. గత ఎన్నికల్లో జగ్గయ్యపేటలో పోస్టల్ ఓట్లతో కలిపి 176,115ఓట్లు పోలవ్వగా, ఈసారి పోస్టల్ ఓట్లతో కూడా కలిపి 1,86,884 ఓట్లు పోలయ్యాయి. గత సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే ఈసారి అదనంగా 10,769ఓట్లు పోలయ్యాయి. 2019ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన సామినేని ఉదయభాను తన సమీప ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)పై 4778ఓట్ల మెజార్టీ సాధించారు. పోలైన ఓట్లలో సామినేని ఉదయభాను 49.94శాతం ఓట్లను సాధించడం ద్వారా జగ్గయ్యపేటలో తనపట్టును నిరూపించారు. రాజగోపాల్‌పై సామినేని ఉదయభాను 2.7శాతం అధికంగా ఓట్లను సాధించారు. ఆ ఎన్నికల్లో జనసేన, కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు ధరణికోట వెంకట రమణకుమార్, కర్నాటి అప్పారావులకు మొత్తం పోలైన ఓట్లలో కనీసం ఒక్కశాతం ఓట్లు కూడా లభించలేదు. ఇక బీజేపీకి 0.3శాతం ఓట్లు మాత్రమే రావడం గమనార్హం.

నందిగామలో పెరిగిన ఓటింగ్ శాతం..

నందిగామ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కంటే ఓటింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో నందిగామలో 87.39శాతం పోలింగ్ నమోదుకాగా, ఈ ఎన్నికల్లో 88.58శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్‌శాతం గతంలో కంటే 1.2శాతం అధికంగా నమోదైంది. ప్రస్తుతం నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05,480మంది ఓటర్లు ఉండగా పోలింగ్‌రోజున 1,79, 952మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2210 మంది పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ద్వారా ఓటేశారు. గత ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి నందిగామలో 1,74,074ఓట్లు పోలవ్వగా, ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి 1,82162ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోల్చితే 8088ఓట్లు అధికంగా పోలయ్యాయి. 2019ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే ఈసారి 4.6శాతం ఓట్లు అధికంగా పోలైనట్లు చెప్పవచ్చు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తన సమీప ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యపై 10,881ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. పోలైన ఓట్లలో 51.32శాతం ఓట్లను సాధించడం ద్వారా తిరుగులేని ఆధిక్యతను చాటిచెప్పారు. డాక్టర్ జగన్‌మోహనరావు తనప్రత్యర్థిపై 6.3శాతం అధికంగా ఓట్లు సాధించడం గమనార్హం. ఆ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థికి 1.6శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 0.7శాతం ఓట్లు, బీజేపీకి 0.5శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.

రెండు రెట్లు పెరిగిన పోస్టల్ బ్యాలెట్లు..

గత ఎన్నికలతో పోల్చితే ఈఎన్నికల్లో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు భారీగా పెరిగాయి. గత 2019 ఎన్నికల్లో జగ్గయ్యపేటలో పోస్టల్ బ్యాలెట్‌ను 722మంది వినియోగించుకోగా ఈసారి 2308మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. గత ఎన్నికల కంటే 1587పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధికంగా పోలయ్యాయి. గతంతో పోల్చితే రెండురెట్లు అధికంగా పోలయ్యాయి. నందిగామలో గత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 937 పోలవ్వగా, ఈసారి 2210 ఓట్లు పోలయ్యాయి. ఈసారి 1273ఓట్లు అధికంగా పోలయ్యాయి. గత ఎన్నికల్లో జగ్గయ్యపేటలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను 404 ఓట్లు సాధించగా, టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్యకు 310ఓట్లు మాత్రమే వచ్చాయి. నందిగామలో గత ఎన్నికల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావుకు 581ఓట్లు దక్కగా, టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యకు కేవలం 329ఓట్లు మాత్రమే దక్కాయి. పోస్టల్ ఓట్లలో 252ఓట్ల ఆధిక్యతను డాక్టర్ జగన్‌మోహనరావు చాటారు. సామినేని ఉదయభాను సైతం పోస్టల్ బ్యాలెట్లలో ప్రత్యర్థికంటే 94ఓట్ల ఆధిక్యతను ప్రదర్శించడం గమనార్హం.

ఓట్లు పెరగడంపై నేతల్లో ధీమా..

గత ఎన్నికలతో పోల్చితే 2024ఎన్నికల్లోనూ మరింత అధికంగా ఓట్లు పోలవ్వడంపై ఆయా పార్టీల నేతలు గెలుపు తమదేనంటూ ఎవరికివారు లెక్కలు వేసుకుంటున్నారు. భారీగా ఓట్లు పోలవ్వడం తమకే లాభిస్తుందని టీడీపీ నాయకులు చెబుతుండగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు జనం జైకొట్టారని వైఎస్సార్ సీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగడం, జనం సైతం గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుని ఓటేయడం గమనిస్తే ఇదంతా పాజిటివ్ ఓటింగ్‌గానే చూడాలని తద్వారా అధికార వైఎస్సార్ సీపీకి ఈ ఓటింగ్ లాభించనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతుండటం గమనార్హం.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు ఆయా గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రాజకిషోర్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతులకు చెందిన రెవెన్యూపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. అలసత్వం వహించినా, అవినీతికి పాల్పడినా, పనితీరుపై ఫిర్యాదులు అందినా కఠిన చర్యలుంటాయని వీఆర్వోలను హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈసారి కూడా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లోనే జమ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి పింఛన్‌లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో 10,432మంది పింఛన్‌దారులు ఉండగా, రూ. 3,10,91,500 మంజూరైనట్లు తెలిపారు. మొత్తం లబ్ధిదారుల్లో నడవలేని వృద్ధులు, దివ్యాంగులైన 2,133 మందికి మాత్రమే సచివాలయ సిబ్బందికి వారి ఇంటికి వెళ్లి రూ.61.92లక్షల పింఛన్ నగదు అందజేస్తారన్నారు. మిగిలిన 8,299మందికి చెందిన పింఛన్ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో పింఛన్ పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందని ఎంపీడీవో రమేష్‌బాబు వివరించారు. పింఛన్ అందని వారు సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

విత్తనాలను అధికధరలకు అమ్మితే చర్యలు



పెనుగంచిప్రోలులో రికార్డులు తనిఖీ చేస్తున్న జేడీ నాగమణెమ్మ, ఏడీఏ, ఏఓ తదితరులు



వత్సవాయిలో విత్తనాల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న జేడీఏ నాగమణెమ్మ

జేడీఏ నాగమణెమ్మ

వత్సవాయి : విత్తనాలను అధిక ధరలకు విక్రయించే డీలర్లపై కఠినచర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఎస్.నాగమణెమ్మ హెచ్చరించారు. మండలకేంద్రం వత్సవాయిలోని విత్తనాల దుకణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని స్టాకు, రిజిస్టర్లు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా జేడీఏ నాగమణెమ్మ మాట్లాడుతూ వత్సవాయి మండలంలో అన్ని దుకాణాల్లో కలిపి అన్ని కంపెనీలకు చెందిన మొత్తం 45వేల పత్తి, మిరప విత్తనాల ప్యాకెట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు మొత్తం ఒకే సామర్థ్యం కలిగినవని, ఒకేరకమైన దిగుబడులు వస్తాయన్నారు. ఓ కంపెనీకి చెందిన విత్తనాల అధిక దిగుబుడులు వస్తాయని వేలంవెర్రిగా అవే కొనవద్దని రైతులకు సూచించారు. అలా చేస్తేల డీలర్లు రైతులకు మోసం చేసే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విత్తనాలను అమ్మాలని దుకాణాల యజమానులకు సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులందింతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. జేడీఏ వెంట జగ్గయ్యపేట ఏడీఏ సీహెచ్ భవాని, అనితాభాను, ఏవో వి.రవికుమార్ ఉన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలో విత్తన దుకాణాల్లో జేడీఏ నాగమణెమ్మ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని రికార్డుల తోపాటు విత్తన స్టాక్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదులను పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే విత్తనాలను అమ్మవాలని దుకాణాదారులను ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని జేడీఏ హెచ్చరించారు. ఆమె వెంట ఏడీఏ అనితాభాను, మండల వ్యవసాయాధికారి కె.రామ సుబ్బారెడ్డి, ఊర్మిలాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన 17 మంది సిబ్బందికి పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్‌ఐలు ఇ.కుచేలరావు, ఎస్.కె.కరీముల్లా, ఎస్.వి.ఎస్.రామారావు, ఎ.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐలు సి.హెచ్.రంగారావు, ఎం.వెంకటేశ్వరరావు, కె.వి.వి.చలం, ఎస్.కె.అన్వర్ బాషా, వై.ఆర్.వి.వి.సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు, కానిస్టేబుల్ బి.వి.రామయ్య, హోంగార్డులు జె.ఆశీర్వాదం, ఎ.మధుసూదనరావు, పి.లక్ష్మి, ఎస్.రుపావతి, కె.సరోజినిని కమిషనరేట్ కార్యాలయం వద్ద శాలువాలు కప్పి సత్కరించారు. ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ కనకరాజు, కార్యాలయ ఏవో రంగారావు, పోలీస్ అధికారుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ. 50 వేల విరాళం

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి భక్తుడు శుక్రవారం రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్ వాస్తవ్యులు దివంగత కొమ్ము బసవయ్య నాయుడు, హైమావతి దంపతుల కుమార్తె శేషదుర్గ, శ్రీధర్ దంపతులు ఈ మొత్తాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ జయప్రకాష్ బాబుకు అందజేశారు.

78 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు: అక్రమంగా మద్యం సీసాలను కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 78 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని నూజివీడు సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ తెలిపారు. సెబ్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నూజివీడు మండలం తూర్పు దిగవల్లికి చెందిన పాముర్తి రాంబాబు వద్ద విస్కీ సీసాలు 30, చాట్రాయి మండలం కోటపాడుకు చెందిన ఎం.లక్ష్మీ వద్ద బ్రాందీ సీసాలు 48 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని చెప్పారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవిసెలవుల తోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. అదేవిధంగా తుళ్లూరుకు చెందిన పంచముఖ ఆంజనేయ స్వామి భక్త సమాజం వారు హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో హనుమాన్‌చాలీసా నిర్వహించారు.



హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్న భక్తులు

భయపెడుతున్న భానుడు

నందిగామ: రెండు రోజులుగా భానుడు భయపెడుతున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాతావరణశాఖ అధికారుల లెక్కల ప్రకారం గురువారం నందిగామ పట్టణంలో పగటి ఉష్ణోగ్రతలు 43.6 నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 30.0 డిగ్రీలు గా నమోదయ్యాయి. అదేవిధంగా శుక్రవారం ఇంకాస్త పెరిగి పగటి ఉష్ణోగ్రతలు 44.1డిగ్రీలు నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 30.4 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచే ఎండ తీవ్రతతోపాటు వడగాల్పులు కూడా వీస్తున్నాయి. ఎండ దెబ్బకు ఇక మధ్యాహ్నం సమయంలో ప్రధాన వీధులు సైతం నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజులుగా రాత్రిపూట కూడా వేడిగాలు వీస్తుండంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోహిణి కార్తె నేపథ్యంలో కొద్దిరోజులపాటు వాతావరణం ఇలాగే ఉంటుందని, అవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



భానుడి ప్రతాపానికి సైతం నిర్మానిష్యంగా మారిన నందిగామలోని సీఎం రోడ్

మహిళాభ్యున్నతికి పాటుపడాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళాభ్యున్నతికి పాటుపడాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమన్ స్టడీ సెంటర్, క్రీడా విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వేసవిని పురస్కరించుకొని మహిళలు, చిన్నారులకు నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల ఆరు దశాబ్దాలుగా ఉన్నత విద్యారంగానికి, సామాజిక వికాసానికి పాటుపడుతోందన్నారు. సమాజంలోని మహిళల వికాసానికి అండగా ఉంటుందని వివరించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగే ప్రతి మహిళా అద్భుతమైన విజయాలను సాధిస్తారని తెలిపారు. మహిళలు నేర్చుకున్న అంశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చాలా చక్కని ప్రతిభను కనబరిచారన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులను మహిళలు ఇష్టంగా ఉత్సాహంగా నేర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ మాట్లాడుతూ ఇలాంటి ముందడుగు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో 15 అంశాల్లో మహిళలకు పది అంశాల్లో చిన్నారులు పాల్గొన్నారన్నారు. 2500 మంది మహిళలు, చిన్నారులు ఉచిత శిక్షణ తరగతులకు హాజరయ్యారన్నారు. ఐదేళ్ల చిన్నారి నుంచి 50 సంవత్సరాల మహిళల వరకూ ఈ తరగతులను సద్వినియోగం చేసుకున్నారని వివరించారు. అధ్యాపకురాలు డాక్టర్‌సుభాషిణి, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ కృష్ణవేణి, స్టడీసెంటర్ కన్వీనర్ శైలజ పాల్గొన్నారు.



సభను ప్రారంభిస్తున్న ఉసిరిక ఉమామహేశ్వరరావు

ధూమపానం మాని ఆరోగ్యంగా ఉండండి

డాక్టర్ మామిడి సీతారామారావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పొగాకు ఉత్పత్తులతో ధూమపానం సేవించే వారి మరణాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయని ప్రముఖ వైద్యులు, సర్జన్ మామిడి సీతారామారావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొండపల్లి మోహనరావు మెమోరియల్ వైద్యశాలలో అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి ఐదుగురిలో ఒకరు పొగతాగుతున్నారన్నారు. వీరిలో 20–25 ఏళ్ల ఆయుష్షు తగ్గుతుందన్నారు. ప్రతి రోజు 10 వేల మంది ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె వ్యాధులతో మృతి చెందుతున్నారని చెప్పారు. సిగరెట్ల కంటే బీడీల్లో తారు, నికోటిన్ తదితర విష పదార్థాలు అధికంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తులు మానేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులు, వాటి వలక కలిగే అనర్థాలపై కరపత్రాలు ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వి.మురళీమోహన్, పి.కామేశ్వర రావు, నాగరాజు, సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మురళీమోహన్

21 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి 5 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థాన కమిటీ చేస్తోంది. బ్రహ్మోత్సవాలను టీటీడీ వేదవిశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మణిదీప్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు, శ్రీనువాసుల గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చురుగ్గా చేస్తోంది.

సహస్ర కలశయాత్రతో..

ఈ నె 21వ తేదీ శుక్రవారం ఉదయం సహస్ర కలశ యాత్ర జరుగుతుంది. ఉదయం దుర్గాఘాట్ నుంచి భక్తులు పవిత్ర కృష్ణాజలాలను కలశాలతో తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. అనంతరం ఉత్సవమూర్తులకు, మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు, స్వామి వారు ఇరు దేవేరులను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెలుగా అలంకరిస్తారు. సాయంత్రం విష్వక్సేన పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, దీక్షాధారణ, కంకణధారణ జరుగుతుంది. 22వ తేదీ ఉదయం అగ్ని ప్రతిష్ట, నవ కుంభస్థాపన, ధ్వజారోహణ, సాయంత్రం నిత్యం హోమం, అష్టాక్షరీ హోమం, నవగ్రహ ఆరాధన, హోమం, సహస్ర దీపాలంకరణ సేవ చేస్తారు. 23వ తేదీ ఆదివారం ఉదయం నిత్యం హోమం, బలిహరణ, సామూహిక కుంకుమార్చన జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఉభయదాతలతో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 24వ తేదీ నిత్య హోమం, బలిహరణ, మహాశాంతి హోమం, శ్రీ పుష్ప యాగం, సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారికి నగరోత్సవ సేవ జరుగుతుంది. 25వ తేదీ మంగళవారం శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని ధ్రువమూర్తికి, ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, అవభృథోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.



చిట్టినగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి